సాక్షి ఒడిశా

గురువారం । 3 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,69,386
బంగారం	16 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
వెండి	520 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రహదారులు రక్తసిక్తం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు.

- 8లో



యువకుడి దారుణ హత్య

ఒక యువకుడిని గుర్తు తెలియని దుండగుడు గొడ్డలితో నరికి అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన రాయగడ జిల్లాలో చోటుచేసుకుంది.

- 8లో

ఓ మహాత్మా.. ఓ మహర్షి

- ఘనంగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత భారత ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ అచంచలమైన అంకితభావంతో కూడిన పోరాటాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్.. జై కిసాన్ నినాదంతో నిజమైన స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: రాష్ట్రస్థాయి మహాత్మ గాంధీ జయంత్యుత్సవంలో మాట్లాడుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝి



భువనేశ్వర్: జాతిపితకు నివాళులర్పిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం మోహన్ చరణ్ మాఝి తదితరులు



భువనేశ్వర్: గాంధేయవాదులకు సీఎం మోహన్ సత్కారం



పర్లాకిమిడి: పట్టణంలో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: గాంధీ జంక్షన్ వద్ద గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో సర్వమత ప్రార్థనలు



కొరాపుట్: దాబుగాంలో స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న మంత్రి నిత్యానంద గొండో



కొరాపుట్: సునాబెడాలో ర్యాలీ నిర్వహిస్తున్న చైర్మన్ రాజేంద్ర కుమార్ పాత్రో తదితరులు



జయపురం: కాంగ్రెస్ భవన్‌లో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని శాస్త్రిలకు నివాళులర్పిస్తున్న నేతలు



పర్లాకిమిడి: పార్క్‌లో గాంధీ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న సబ్ కలెక్టర్ శౌశ్య రెడ్డి తదితరులు



కొరాపుట్: సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న కలెక్టర్ వి.కీర్తి వాసన్ తదితరులు



మల్కన్‌గిరి: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ పటేల్ తదితరులు



రాయగడ: గాంధీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్ పట్నాయక్



రాయగడ: కోర్టులో స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న న్యాయవాదులు, న్యాయమూర్తులు



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



మల్కన్‌గిరి: కాంగ్రెస్ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు

న్యూస్‌రీల్

గుట్కా విక్రయ దుకాణాలపై దాడులు



దుకాణాల్లో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో ఉన్న వివిధ దుకాణాల్లో నిషేధిత గుట్కా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్న సమాచారంపై ఎక్సైజ్, పోలీసు, ఫుడ్ శాఖ అధికారులు మంగళ, బుధవారాల్లో ఆకస్మిక దాడులను నిర్వహించారు. పలు దుకాణాల్లో గుట్కా విక్రయాలు చేస్తున్నారని గుర్తించిన అధికారులు, వారిపై జరిమానాలు విధించారు. ఇకపై ఇటువంటి నిషేధిత వస్తువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను పద్మపూర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 26 కిలోల గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్లు, రూ.1,880 నగదును స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టుకు తరలించారు. మంగళవారం సాయంత్రం ఎప్పటిలాగే పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రెండు బైకులను ఆపి, వెనుకనున్న బస్తాలను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసి బైకులను సీజ్ చేశారు.

పిడుగులు పడి పశువులు మృతి



పిడుగులు పడి మృతి చెందిన గొర్రెలు, ఎద్దులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి చంద్రపడ గ్రామ పంచాయతీ పిపల్‌గుడ గ్రామ అడవిలో గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలును పశువుల కాపరి మేతకు తీసుకెళ్లాడు. అవి మేత మేస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగులు పడ్డాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 2 ఎద్దులు, 13 గొర్రెలు సంఘటన స్థలం వద్దనే మరణించగా, మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలిసిన గ్రామస్తులు సంఘటన ప్రాంతానికి చేరుకొని గాయపడిన గొర్రెలను తీసుకెళ్లారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


మోదీ హయాంలో రైతులకు మేలు



కృషక్ విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తున్న సాహు తదితరులు

రాయగడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలోని రైతులకు మేలు జరిగిందని బీజేపీ కృషక్ మోర్చ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహేశ్వర్ సాహు అన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో మంగళవారం సాయంత్రం పర్యటించిన ఆయన కృషక్ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. కృషక్ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సస్మిత మహంతి అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం అండగా ఉందని పేర్కొన్నారు. రైతులు పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటోందని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం మద్దతు ధరను రూ.3,100 పెంచారని గుర్తు చేశారు. ఇటువంటి రైతు సంక్షేమ పనులు మరెన్నో రానున్న రోజుల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృషక్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణచంద్ర పండ, సభ్యులు సుమంత్ కుమార్ మహారాణ, రజత్ కుమార్ మదల, రాజేశ్ కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ధవళ ముఖి సమలేశ్వరి



పశ్చిమ ఒడిశా సంబలపూర్ ప్రాంతీయుల అధిష్టాన దేవత సమలేశ్వరి. ఏటా మహాలయ తిథి పురస్కరించుకుని భక్తులకు ధవళ ముఖిగా దర్శన భాగ్యం కల్పించడం విశేషం. ఏడాది పొడవునా సమలేశ్వరి మాత సింధూర వర్ణ ముఖిగా భక్తులకు దర్శనం ఇస్తుంది. బుధవారం ధవళ ముఖిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి సర్వ దర్శనం సౌకర్యం కల్పించారు. – భువనేశ్వర్

తాపీ పట్టిన ఎంపీ బలభద్ర మజ్జి



తాపీతో పని చేస్తున్న ఎంపీ బలభద్ర మజ్జి

కొరాపుట్: బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మజ్జి తాపీపట్టి మేస్త్రీ పని చేశారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి 11వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం లబ్ధిదారులైన సబితా గొండో, మహేష్ గొండోలు తమ ఇల్లు తామే నిర్మించుకుంటున్నారు. ఇది చూసిన ఎంపీ తాను కూడా వారితో జత కలిశారు. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సురభి శిశు మహోత్సవం



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

జయపురం: కుంద్ర సమితి కెరమెట గ్రామ ఉన్నత పాఠశాలలో బుధవారం సరభి శిశు మహోత్సవం నిర్వహించారు. కుంద్ర సమితి బీడీవో ప్రకాశ కర్తామీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చేపట్టిన విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌరవ అతిథిగా కొరాపుట్ జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్, బ్లాక్ అదనపు విద్యాధికారి పాపెయి బెహర, సమితి సంఘ అధ్యక్షుడు త్రినాథ్ పండ, సర్పంచ్ మాణిక్ శాంత, సీఆర్‌సీసీ ప్రమోద్ బారిక్, కెరామటి ఉన్నత పాఠశాల హెచ్ఎం పవిత్ర భొయి తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్ బంద్‌కు మద్దతు

జయపురం: జిల్లాస్థాయి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీన అవిభక్త కొరాపుట్ జిల్లా 12 గంటల బంద్ పిలుపునకు తమ పూర్తి మద్దతు ఉంటుందని రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ దళిత వర్గాల మహాసంఘ మహిళా విభాగ అధ్యక్షురాలు మనస్వినీ టక్రి వెల్లడించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం బహుళ ఆదివాసీ కొరాపుట్ జిల్లాపై చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీమందిరాన్ని సందర్శించిన సభా కమిటీ



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సభా కమిటీ

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దర్శనం కోసం శ్రీమందిరానికి విచ్చేసే భక్తులు, యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలను శాసన సభ స్థాయీ కమిటీ సమీక్షించింది. గంజాం జిల్లా దిగపహండి నియోజకవర్గం ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో అధ్యక్షతన ఈ కమిటీ శ్రీమందిరాన్ని ప్రత్యక్షంగా సందర్శించింది. శ్రీజగన్నాథ ఆలయ కార్యాలయం సమావేశ హాలులో నిర్వహించిన సమావేశంలో శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢి, పూరీ జిల్లా కలెక్టరు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భద్రతే ప్రధానంగా

శ్రీమందిరం, భక్తుల భద్రత ప్రధాన అంశంగా కమిటీ చర్చించింది. నిత్యం తండోపతండాలుగా తరలి వచ్చే భక్తులు, యాత్రికులకు సులభ దర్శనం ఏర్పాట్లని సమీక్షించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ప్రతిపాదనలు చేస్తుందని అధ్యక్షుడు సిద్ధాంత మహాపాత్రో తెలిపారు. శ్రీమందిరం శిఖర పరిధిలో డ్రోన్ వీక్షణపై పటిష్ట నిఘా అవసరమని కమిటీ సూచించింది. నో డ్రోన్ జోన్‌గా పరిగణించాలని తెలిపింది. సాగర తీర పుణ్య క్షేత్రం కావడంతో తీర ప్రాంత భద్రత కోసం మెరైన్ ఠాణా, కోస్టు గార్డు వ్యవస్థని సమీక్షించారు. శ్రీ మందిరం శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక బెటాలియన్ నియామకం ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో తుది మెరుగులు దిద్దుకుంటుంది. శ్రీ మందిరం సమగ్ర భద్రతా వ్యవస్థ పటిష్ఠతకు ఎటువంటి లోటు లేకుండా చర్యలు చేపట్టేందుకు సిఫారసు చేయనున్నట్లు వివరించారు.

గజరాజుల సంచారం



అటవీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా విహరించాల్సిన ఏనుగుల గుంపు క్రమంగా జనావాసాల వైపు తరలి వస్తున్నాయి. కెంజొహర్ అటవీ ప్రాంతం సరిహద్దు పంట పొలాల్లో భారీగా ఏనుగుల గుంపు చొరబడింది. ఈ గుంపులో 35 ఏనుగులు ఉన్నట్లు స్థానిక అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మానవ దాడులకు అవకాశం లేకుండా శాంతియుతంగా వీటిని దారి మళ్లించే ప్రయత్నంలో అటవీ శాఖ వర్గాలు తలమునకలై ఉన్నాయి. – భువనేశ్వర్

నబరంగ్‌పూర్ @ 32 ఏళ్లు



నబరంగ్‌పూర్ జిల్లా ఏర్పడి బుధవారం నాటికి 32 సంవత్సరాలు ముగిశాయి. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అప్పట్లో కొరాపుట్ జిల్లాను విడదీసి నబరంగ్‌పూర్, రాయగడ, మల్కన్‌గిరి జిల్లాలు ఏర్పాటు చేశారు. – కొరాపుట్

క్లుప్తంగా

విద్యార్థులకు కొత్త యూనిఫారమ్



కొత్త యూనిఫారమ్ నమూనా

భువనేశ్వర్: రాష్ట్రంలో మాధ్యమిక పాఠశాలల విద్యార్థులకు కొత్త యూనిఫారమ్ ప్రతిపాదించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి ఛత్ర ఛత్రి (విద్యార్థి – విద్యార్థినులు) పరిధాన్ యోజన కింద 9, 10వ తరగతి విద్యార్థులకు కొత్త యూనిఫారమ్ పంపిణీ చేస్తారు. ప్రస్తుతానికి పాత యూనిఫారమ్ విద్యార్థులకు పంపిణీ చేయకుంటే, కొత్త యూనిఫారమ్ దుస్తుల్ని సరఫరా చేయాలని రాష్ట్ర పాఠశాలలు – సామూహిక విద్యా విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధ్యాయుల నియామకాలపై నిరసన



ఆందోళన చేపడుతున్న నాయకులు

కొరాపుట్: జూనియర్ ఉపాధ్యాయుల నియామకాలు జిల్లాస్థాయిలో చేపట్టాలని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గాంధీ జంక్షన్ వద్ద అఖిల పార్టీ నాయకులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని బుధవారం నిరసన తెలిపారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 4వ తేదీన జిల్లా బంద్‌కి పిలుపునిచ్చారు. ఆందోళనలో బీజేడీకి చెందిన మాజీ ఎంపీలు ప్రదీప్ మజ్జి, భగవాన్ మజ్జి, కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్నా త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యేలు భుజబల్ మజ్జి, సదానా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పితృ పూజలు



విరజామాత పీఠం సముదాయం నాభి గయ ప్రాంగణంలో పితృ పూజలు చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: మహాళయ అమావాస్య పురస్కరించుకుని బుధవారం రాష్ట్రంలో పలుచోట్ల పితృ కార్యాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పుష్కరిణి, సరోవరం ఇతరేతర పవిత్ర జలాశయాలతో పుణ్య క్షేత్రాల్లో పితృ దేవతలకు పిండ ప్రదానం చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ప్రముఖ శక్తి పీఠంగా పేరొందిన జాజ్‌పూర్ విరజామాత దేవస్థానం సముదాయం ప్రాంగణంలో నాభి గయ పిండ ప్రదాన కార్యక్రమాలకు ప్రసిద్ధి. ఇందు పూర్ణిమ నంచి మహాళయ అమావాస్య వరకు పితృ పక్షంగా పరిగణించి పిండ ప్రదానాలకు పవిత్ర సమయంగా పరిగణిస్తారు. అమావాస్యతో పితృ పక్షం పూర్తి కావడంతో బుధ వారం ఈ ప్రాంగణం కిటకిటలాడింది. పూరీ పుణ్యక్షేత్రం, స్థానిక బిందు సాగర్ వంటి ప్రముఖ ప్రాంతాలు పితృ దేవతల పూజాదుల కోసం ప్రత్యేక సదుపాయాలతో సిద్ధం అయ్యాయి. లోగడ శ్రీమందిరం సింహ ద్వారం చేరువలో 22 మెట్లపై పితృ పిండ ప్రదాన కార్యక్రమానికి అనుమతించేవారు. ఇటీవల ఈ సౌకర్యం తొలగించారు. శ్రీ మందిరం ప్రహరి మేఘనాథ్ ప్రాంగణంలో వెలుపల ఈ కార్యక్రమాలకు వెసులుబాటు కల్పించారు.

రెసిడెన్సియల్ పాఠశాలల ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి నిత్యానంద తదితరులు

మల్కన్‌గిరి:

జిల్లాలోని మత్తిలి, చిత్రకొండ సమితుల్లో ఏకలవ్య మోడ్రన్ రెసిడెన్సియల్ పాఠశాలలను పీఎం నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ప్రారంభించారు. మత్తిలి సమితిలో కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి నిత్యానందో గోండ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు మల్కన్‌గిరి జిల్లా అంటే అన్ని రంగాల్లో వెనుకబడి ఉండేదని, నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలియజేశారు. విద్యార్థులు ఆంగ్లభాషపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. ఒడిశా రాష్ట్రం మొత్తంలో ప్రస్తుతం 47 ఏకలవ్య పాఠశాలలు ఉండగా, ఇప్పుడు మరో 11 పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

• మంచు కురిసే వేళలో..!






రాయగడ జిల్లాలోని గుణుపూర్ వెళ్లే మార్గంలో బుధవారం మిట్ట మధ్యాహ్నం పొగమంచు అలముకుంది. ఒకవైపు ఎండ ఉండగా, మరోవైపు మంచు కమ్ముకోవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. గత రెండు రోజులుగా మబ్బులతో కూడుకున్న జల్లులు పడుతుండడంతో ఇటువంటి దృశ్యం అలుముకుంది. – రాయగడ

శ్రీక్షేత్రంలో గుప్త గుండిచా ఉత్సవం



మాధవ స్వరూప శ్రీజగన్నాథుడు



మహిషాసుర మర్దిని స్వరూపిణిగా శ్రీమహాలక్ష్మి

భువనేశ్వర్: శ్రీజగన్నాథుడు కొలువుదీరిన శ్రీక్షేత్రంలో గుప్త గుండిచా ఉత్సవం ఆరంభమైంది. పూరీ డోల మండప వీధిలో నారాయణి ఆలయానికి దుర్గామాధవులు చేరారు. శ్రీమహాలక్ష్మిని వీడి శ్రీజగన్నాథుడు సోదరితో కలిసి రథయాత్ర ముగించడం దేవేరికి ఒకింత మనస్తాపానికి గురి చేసింది. ఈ సందర్భంగా బుజ్జగిస్తూ షోడశ దినాత్మక దేవీ పూజలు పురస్కరించుకుని, చివరి 8 రోజులు శ్రీమహాలక్ష్మితో గుప్త గుండిచా యాత్రలో పాల్గొంటానని ఇచ్చిన మాట ప్రకారం ఏటా దేవీ నవరాత్రులు పురస్కరించుకుని శ్రీక్షేత్రంలో గుప్త గుండిచా యాత్ర జరుగుతుందని శ్రీజగన్నాథ తత్త్వవేత్తల సమాచారం. దుర్గామాధవ ఉపాసనలో దుర్గామాత స్వరూపిణిగా శ్రీమహాలక్ష్మి మాధవునిగా శ్రీజగన్నాథుడు పూజలు అందుకోవడం విశేషం. 8 రోజులు జరిగే గుప్త గుండిచా యాత్రలో భాగంగా నిత్యం శ్రీమందిరంలో చందన సేవ ముగియడంతో రథాకృతి విమానంలో దుర్గామాధవులు డోలో మండప వీధిలో నారాయణి మందిరానికి చేరుతారు. సంధ్యా ధూపం తర్వాత పల్లకిలో తిరిగి శ్రీమందిరానికి చేరుతారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- జెడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి



వేదికపై సరస్వతి, కద్రక, పట్నాయక్ తదితరులు

రాయగడ: అందరి సహకారంతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అడిటోరియంలో ఎంబీసీ సంస్థ జిల్లా వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రాయగడ జిల్లాగా ఆవిర్భవించి 32 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. మూడు దశాబ్దాల్లో జిల్లా ఎంతో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. గత 24 ఏళ్ల బీజేడీ పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి నాంది పలకాలని హితవు పలికారు.

కాగితాలకే అభివృద్ధి పరిమితం

కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక మాట్లాడుతూ రాయగడ జిల్లా అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఎన్నో గ్రామాల్లో తాగు, సాగునీరు, రహదారి, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు లేవన్నారు. రెండు దశాబ్దాల కాలంలో ఇదేనా అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఖనిజ సంపదను దృష్టిలో పెట్టుకొని ఎన్నో పరిశ్రమలు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. అయినా జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదని వాపోయారు. పొట్ట కూటి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లి, శవాలుగా ఇంటికి చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు స్వప్రయోజనాలకు స్వస్తి పలికి, ప్రజా శ్రేయస్సు కోసం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాష్ట్ర శాఖ కార్యదర్శి రమేష్ చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు.

• జల దిగ్బంధం



సురక్షిత ప్రాంతాలకు తరలింపు



ఖజూర్‌గూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాంగుఖీలో తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా నక్కమామిడి పంచాయతీ పరిధి ఖజూర్‌గూడ, ముదిలిగూడ, పెమినింగి తదితర గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. చిత్రకొండ జలాశయంలో నీటిమట్టం పెరగడంతో ఈ గ్రామాలకు వరద ముంపు పొంచి ఉంది. జలాశయం నీటిమట్టం 1,516 అడుగులు కాగా, ప్రస్తుతం 1514 అడుగుల వరకు నీరు ఉంది. దీంతో ఏ క్షణంలో అయినా వరద పెరిగితే జోడంబో, పెప్పరమేట్ల, పనాస్‌పూట్ రల్లేగడ పంచాయతీలు కూడా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం చిత్రకొండ ఎమ్మెల్యే మాంగుఖీలో, అధికారులు నాటు పడవల్లో వరద ప్రాంతానికి వెళ్లి సర్వే చేశారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరించారు.

ప్రజల హృదయాల్లో మా స్థానం పదిలం

- మాజీ సీఎం నవీన్ పట్నాయక్
- ప్రారంభమైన బీజేడీ పాదయాత్ర



పర్లాకిమిడి: పాదయాత్రలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తదితరులు



కొరాపుట్: ర్యాలీ చేస్తున్న మాజీ ఎంపీ రమేష్, ఎమ్మెల్యే రంధారీ తదితరులు

భువనేశ్వర్: గత ఎన్నికల్లో తాము ఓటమి పాలైనా, ప్రజల హృదయాల్లో తమ స్థానం పదిలంగా ఉందని బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. స్థానిక నగర పాలక సంస్థ 57వ వార్డులో బిజూ ఆదర్శ కాలనీ నుంచి గాంధీ జయంతి పురస్కరించుకొని పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, లేకున్నా తాము ప్రజల కోసమే పనిచేస్తామన్నారు. ప్రజల సుఖ, దుఃఖాల్లో బీజేడీ పాలుపంచుకుంటుందని పేర్కొన్నారు. స్వాభిమానంతో ప్రజల పక్షాన నిరంతరం ఉద్యమిస్తుందన్నారు. 24 ఏళ్ల సుదీర్ఘ పాలనలో రాష్ట్ర వికాసం కోసం ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశామని వెల్లడించారు.

పలు రంగాల్లో ప్రగతి

విద్య, ఆరోగ్యం, పారదర్శక పాలన, మహిళా సాధికారిత, పెట్టుబడులు ఇతరేతర రంగాల్లో పురోగతి నేటికీ ప్రతిబింబిస్తుందన్నారు. బీజేడీ పాలనలో రాష్ట్రంలో బీదరికం 70 శాతం నుంచి 10 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. పలు జన సహిత పథకాలతో ప్రభుత్వం రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంపొందించిందని తెలిపారు. ప్రజారోగ్య సంరక్షణ రంగంలో బీజేడీ ప్రభుత్వ పాలన అనన్యమని పేర్కొన్నారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన అత్యంత ప్రజాహిత పథకంగా విశేష ప్రజానీకానికి అక్కరకు వచ్చి దిగ్విజయ పథకంగా నిలిచిందన్నారు. పాదయాత్ర ప్రజలతో సత్సంబంధాలు బలపరిచే దృఢమైన వారధిగా నిలుస్తుందన్నారు. పాదయాత్ర సందర్భంగా స్థానిక నేతాజీ బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేసిన సభలో నవీన్ పట్నాయక్ ప్రసంగించారు. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్‌కు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు.

కొరాపుట్‌లో...

బిజూ జనతా దళ్ పార్టీ ప్రతీ ఏడాది ఘనంగా నిర్వహించే జన సంపర్క్ యాత్రలు ప్రారంభమయ్యాయి. నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రంలో వేలాది మంది ప్రజలతో ఈ ర్యాలీ జరిగింది. తొలి విడతగా ఈనెల 6వ తేదీ వరకు కొనసాగిస్తారు. మలి విడత ఈనెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు యాత్రలు కొనసాగనున్నాయి. తొలిరోజు యాత్రలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్ర మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎమ్మెల్యేలు సదాశివ ప్రదాని, ప్రకాష్ చంద్ర మజ్జి తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వర్: పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతున్న నవీన్ పట్నాయక్

పర్లాకిమిడిలో...

బిజూ జనతా దళ్ పార్టీ గుసాని సమితిలో జన సంపర్క పాదయాత్రను ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక విఫలమయ్యిందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలు అమలు చేసేవరకు ప్రజల తరుపున పోరాడతామని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, బసంత్ దాస్, బీజేడీ యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, జెడ్పీటీసీ(గుసాని) ఎస్.బాలరాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ యరగాన రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది బీజేడీ కార్యకర్తలు

రహదారులు రక్తసిక్తం



రాయగడ: నుజ్జునుజ్జు అయిన స్కూటీ



జయపురం: ప్రమాదానికి గురైన బస్సు, ట్రక్కులు



రాయగడ: గాయపడిన రామదాస్ సరక



కొరాపుట్: బిశ్వరంజన్ మృతదేహం



కొరాపుట్: రాయగడ-కొరాపుట్ మార్గంలో నిలిచిన రవాణా సేవలు

కొరాపుట్: జిల్లాలోని సిమిలిగుడ పట్టణం సమీపంలో దమంజోడి జంక్షన్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మృతుడు నందపూర్ సమితి బనమాలిపూర్ గ్రామ పంచాయతీ లమందా గ్రామానికి చెందిన బిశ్వరంజన్ మండల్ నాయక్ (17)గా గుర్తించారు. బిశ్వ రంజన్ ఒక బైక్‌పై వెళ్తుండగా ట్రిప్పర్ ఢీకొంది. దీంతో తలకి తీవ్రగాయమైంది. వెంటనే పోలీసులు బాధితుడిని సునాబెడా పీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

22 మందికి తీవ్రగాయాలు



జయపురం: రెండు వాహనాల మధ్య ఇరుకున్నవారిని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం/కొరాపుట్: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమీప దుమురిపుట్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాయగడ నుంచి నవరంగపూర్ వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు కొరాపుట్ నుంచి రాయగడ జిల్లా జేకేపూర్‌కు వెళ్తుండగా, నీలగిరి కలప తీసుకెళ్తున్న ఒక ట్రక్కు ముఖాముఖి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు, లారీల డ్రైవర్లు ప్రమాదానికి లోనైన వాహనాల మధ్య ఇరుక్కుపోయారు. లక్ష్మీపూర్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రులను లక్ష్మీపూర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద ఇరువురు డ్రైవర్లను బయటకు తీసి, వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురికి గాయాలు

రాయగడ: ఒక స్కూటీ, బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటనలో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి డెప్పాగుడ మలుపు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనలో గాయాలు పాలైనవారిలో కల్యాణ సింగుపూర్ బజారు వీధికి చెందిన కృపా వైశాఖ, గౌఖులో మాలి, బామునగుడ గ్రామానికి చెందిన లచన హికక, రామదాస్ సరక, సురేష్ సరకలు ఉన్నారు. వీరిలో కృపా వైశాఖ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కృప, గౌఖులో కలిసి ఒక స్కూటీలో కరంజీ గ్రామానికి వెళ్తున్న సమయంలో, డెపాగుడ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకును అదుపుతప్పి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య



ఘాసీరాం మృతదేహం

రాయగడ: ఒక యువకుడిని గుర్తు తెలియని దుండగుడు గొడ్డలితో వెంటాడి నరికి అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన జిల్లాలోని బిసంకటక్ పోలీసుస్టేషన్ పరిధి చాటికొన మలివీధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. హత్యకు గురైన వ్యక్తి ఘాసీరాం జిలకర్ర (32)గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. మలివీధిలో ఆరు బయట ఉన్న ఘాసీరాంపై గుర్తు తెలియని వ్యక్తి హఠాత్తుగా గొడ్డలితో దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని వెంటాడి మరీ నరికి చంపాడు. దుండగుడు దాడి చేస్తున్న సమయంలో ఘాసీరాం పరుగున తన ఇంటివరకు వెళ్లి ఇంటి ఆవరణలో పడిపోయాడు. దీంతో మృతి చెందాడని నిర్ధారించుకున్న అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటి బయట రక్తపు మడుగులో పడి ఉన్న ఘాసీరాంను చూసిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి బుధవారం తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

క్లుప్తంగా

బీజేపీది దురహంకార పాలన..

● డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం దరహంకారంతో పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ ఆరోపించారు. ఈ మేరకు బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ తోటపాలెం సత్య కళాశాల దగ్గరున్న గాంధీ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల బీజేపీ పాలన విభజించు - పాలించు పద్ధతిలో సాగిందన్నారు. బీజేపీ నాయకులు దేశంలో కుల, మతాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్‌ఐ రమేష్

బొబ్బిలి: పట్టణంలోని దిబ్బవీధికి చెందిన వేగి సూరిబాబు 242 మద్యం సీసాలను బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. సీఐ కె.సతీష్‌కుమార్ ఆదేశాలతో మంగళవారం రాత్రి దాడితల్లి గుడి వద్ద కాపు కాయగా సదరు వ్యక్తి రెండు బ్యాగుల్లో రూ.37,200 విలువైన మద్యం సీసాలను తరలిస్తున్నాడన్నారు. సదరు బైక్‌ను, మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రమేష్ చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దూసి వసంత్‌కుమార్

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన దూసి వసంత్‌కుమార్ అదృశ్యంపై అతని తమ్ముడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.కళాధర్ తెలిపారు. గత నెల 15న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన వసంత్‌కుమార్ ఇంత వరకు ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 100 లేదా 63099 90873 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ అప్పలనాయుడు

గంట్యాడ: మండలంలోని జగ్గాపురం గ్రామానికి చెందిన మొయిద అప్పలనాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే...అప్పలనాయుడు తన అత్తవారి గ్రామమైన విజయనగరం మండలం మలిచర్ల గ్రామంలో భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య వివాహేతర సంబంధం విషయమై కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం కూడా ఇద్దరూ గొడవ పడ్డారు. తాపీ పనికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన అప్పలనాయుడు తన స్వగ్రామం జగ్గాపురం వచ్చేశాడు. అక్కడ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అప్పలనాయుడు తండ్రి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్న అప్పలనాయుడును చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం బంధువులకు అప్పగించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు.

గోకులాల గోల..!

'గంట్యాడ మండలానికి మినీ గోకులాలు 26 మంజూరయ్యాయి. మండలంలో 36 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీకి ఒకటి చొప్పన కూడా మంజూరుకాని పరిస్థితి. మినీ గోకులాలు కావాలని 401 మంది పాడి రైతులు దరఖాస్తు చేశారు. తమకే కేటాయించాలంటూ అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి మొదలైంది. దీంతో ఎవరికి కేటాయించాలో తెలియక అధికారులు సతమవుతున్నారు.'

'బొండపల్లి మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. మినీ గోకులాలు 26 మంజూరయ్యాయి. ఇక్కడ కూడా పంచాయతీకి ఒకటి చొప్పన మంజూరుకాని పరిస్థితి. ఈ మండల రైతుల నుంచి 350 దరఖాస్తులు వచ్చాయి. అర్హులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేయాలన్నది తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.'

- మంజూరు 700.. దరఖాస్తులు సుమారు 10వేలు
- తమకే కేటాయించాలంటూ అధికారపార్టీ నేతల ఒత్తిడి
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఎవరికి కేటాయించాలో తెలియక సతమతం



రెండు పశువుల కోసం నిర్మించే మినీ గోకులం

విజయనగరం ఫోర్ట్: పాడి రైతులందరికీ రాయితీపై మినీగోకులాల యూనిట్లు కేటాయిస్తామంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తీరా ఆచరణలో తుస్సుమనిపించింది. గోకులాల కోసం జిల్లాలో అర్హుల నుంచి వేలలో దరఖాస్తులు రావడం, యూనిట్లు వందల్లో మంజూరు కావడంతో ఎవరికి కేటాయించాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. దీనికి తోడు తమవారికే కేటాయించాలంటూ అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కూటమి ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

27 మండలాలకు 700 మినీ గోకులాలు మంజూరు

జిల్లాకు 700 మినీ గోకులాలు మంజూరయ్యాయి. వీటిని జిల్లాలో ఉన్న 27 మండలాలకు 26 చొప్పన కేటాయించారు. మినీ గోకులాల కోసం ప్రతి మండలం నుంచి 350 నుంచి 400 చొప్పన జిల్లా వ్యాప్తంగా సుమారు పదివేలు దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు విజయనగరం మండలం నుంచి మాత్రమే డ్వామాకు ప్రతిపాదనలు అందాయి. మిగతా మండలాలు నుంచి ఇంకా ప్రతి పాదనలు రాలేదు. గోకులాలు కోసం పంచాయతీలో తీర్మానం చేసి పంపించాలి. ఒక్కో గ్రామం నుంచి 10 నుంచి 20 మంది పాడిరైతులు గోకులాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. గ్రామానికి ఒకరికి తీర్మానం చేస్తే మిగతా పాడి రైతులతో ఒత్తిళ్లు వస్తాయని సర్పంచ్‌లు తీర్మానం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ లెక్క...

మినీ గోకులాలకు సంబంధించి రెండు పాడి పశువుల మినీ గోకులం యూనిట్ విలువ రూ.1,15,000. ఇందులో ఉపాధిహామీ నిధుల నుంచి రూ.1,03,500లు రాయితీ వర్తించగా, లబ్ధిదారుడి వాటాగా రూ.11.500 పెట్టుకోవాలి. నాలుగు పశువుల యూనిట్ విలువ రూ.1,85,000 కాగా, ఉపాధిహామీ నిధులు రూ.1.66,500 ఇస్తారు. లబ్ధిదారుడు వాటాగా రూ.18,500 పెట్టుకోవాలి. ఆరు పశువుల యూనిట్ విలువ రూ.2,30,00 కాగా అందులో ఉపాధి హామీ నిధులు 2,07,000 కేటాయిస్తారు. లబ్ధిదారుడు వాటాగా రూ.23 వేలు పెట్టుకుంటే చాలు. మినీ గోకులాల కేటాయింపు విషయం తెలుసుకునేందుకు డ్వామా పీడీ ఇ.సందీప్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

అధికారులపై టీడీపీ నేతల ఒత్తిడి

పంచాయతీ తీర్మానంతో సంబంధం లేకుండా తాము రాసిచ్చిన వారికే గోకులాలు మంజూరు చేయాలని టీడీపీ నేతలు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దీంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. టీడీపీకి చెందిన నేతలు తమ వారి జాబితాలను సైతం అధికారులకు పంపించారట. తమ వారికి గోకులాలు కేటాయించకపోతే పరిస్థితులు వేరేవిధంగా ఉంటాయని బెదిరింపునకు దిగుతున్నట్టు భోగట్టా. మినీ గోకులాలకు 90 శాతం ప్రభుత్వ రాయితీ ఉండడంతో తమవారికి మంజూరు చేసేందుకు టీడీపీ నేతలు గట్టిప్రయత్నాలు చేస్తున్నారు.

గిరిజన సంస్కృతి, ఆచారాలు కాపాడుకోవాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు
- ఏబీవీపీ ఆధ్వర్యంలో జనజాతి విద్యార్థుల సమ్మేళనం



అంతర్జాతీయ అంధుల క్రికెట్ రవళిని సన్మానిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తదితరులు

విజయనగరం: ఆధునిక ప్రపంచంలో గిరిజన సంస్కృతి, ఆచారాలు కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని పీఎస్ ఆర్ స్కూల్ ఆవరణలో గత రెండు రోజులుగా నిర్వహించిన జనజాతి విద్యార్థుల సమ్మేళనం బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ డివిజి.శంకరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఛత్రపతి శివాజీ, అల్లూరి సీతారామారాజు వంటి అనేకమంది గిరిజనులు వెంట నడిచి ప్రాణాలు సైతం అర్పించారని గుర్తు చేశారు. అడవిని, నీటిని, భూమిని నిత్యం దేవతలుగా కొలుస్తూ, ప్రకృతి మాత బిడ్డలుగా గిరిజనులు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు జాతీయ భావాలతో, దేశం కోసం ధర్మం కోసం గిరిజన సంస్కృతినీ పరిరక్షిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, క్రీడల్లో ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ అంధుల క్రికెటర్ రవళి, జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలో బంగారు పతకం సాధించిన సింహాచలంలను సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు విద్యారంగ సమస్యలపైన తీర్మానం చేసి ఆమోదించారు. కార్యక్రమంలో ఏబీవీపీ అఖిల భారత సహా సంఘటన కార్యదర్శి గోవింద్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తారకేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జయచంద్ర, జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్, విభాగ్ కన్వీనర్ బొబ్బది సాయికుమార్, గిరిజన విద్యార్థుల కన్వీనర్ గెమ్మలి కళ్యాణ్, జిల్లా కన్వీనర్ సంపత్, ఏబీవీపీ నాయకులు, వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతి ప్రక్రియ చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి రాము నాయుడు

విజయనగరం అర్బన్: జిల్లాలో పదోన్నతులకు కేటాయించిన ఖాళీలను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో తీర్మానించారు. తొలిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలో పదవీ విరమణ కారణాల వల్ల ఖాళీగా ఉన్న పోస్టులలో పదోన్నతి కోటాను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇజ్జురోతు రామునాయుడు, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పీవీకే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రమణ, కె.సంతోషలక్ష్మి, జిల్లా గౌరవ అధ్యక్షుడు వివి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ



కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం టౌన్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి బుధవారం పార్వతీపురం సబ్-డివిజినల్ పోలీసు కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. పెండింగ్‌లో వున్న కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది ఆరా తీశారు. కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధానాలపై ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యాలయంలో నిర్వహించే రికార్డ్స్ పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రణకు సబ్ డివిజన్ పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సబ్ - డివిజినల్ పరిధిలో గల శాంతి భద్రతల సమస్యల గురించి అడిగి తెలుసుకొని, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాలన్నారు. పార్వతీపురం సబ్-డివిజినల్ అధికారి అంకిత సురాన, సిబ్బంది పాల్గొన్నారు.

'పైడితల్లి' జాతరను విజయవంతం చేయాలి



సాకేటివీధి పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

- డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని, అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం సాకేటి వీధి, కమ్మవీధిలో ఉన్న పెద్దలతో విడివిడిగా చర్చించారు. ఉత్సవాలు నిర్వహించే తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు ప్రతీ ఏటా తమకు ఎదురయ్యే ఇబ్బందులను డీఎస్పీకి వివరించారు. హుకుంపేట నుంచి అమ్మవారి ఆలయానికి వచ్చేటప్పుడు పోలీసులు బారికేడ్లు వేసి, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా కమ్మవీధికి చెందిన పెద్దలు పలు ఇబ్బందులను వివరించారు. మసీదు వద్దకు వచ్చేటప్పుడు బారికేడ్లు పెట్టేయడం వలన ఇబ్బందిగా ఉందని, లోపలికి ప్రవేశించేటప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. తిరిగి వెళ్లేటప్పుడు కూడా రోప్ పార్టీలు పెట్టి అమ్మవారి సేవకులను పంపించాలని సూచించారు. ఈ విషయమై డీఎస్పీ స్పందిస్తూ పైడితల్లి అమ్మవారి జాతర ఉత్సవాలలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని హామీనిచ్చారు. జిల్లా పోలీసు శాఖ తరపున పూర్తి సహాయ, సహకారాలందిస్తామన్నారు. అమ్మవారి సంబరాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమ్మవీధి, సాకేటివీధి పెద్దలు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల్లో దుర్గాదేవీకి ప్రత్యేక అలంకరణలు

విజయనగరం టౌన్:

శరన్నవరాత్రులను పురస్కరించుకుని పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ అమ్మవారు ప్రతీరోజూ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారన్నారు. 3న గురువారం అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవీగా, 4న శుక్రవారం గాయత్రీదేవీగా, 5న శనివారం అన్నపూర్ణాదేవీగా, 6న ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవీగా, 7న సోమవారం మహా చండీదేవీగా, 8న మంగళవారం శ్రీ మహాలక్ష్మీదేవీగా, 9న బుధవారం మూలానక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు శ్రీ సరస్వతీదేవీగా అలంకరణ చేస్తారన్నారు. అదేవిధంగా 10న గురువారం దుర్గాష్టమి పురస్కరించుకుని శ్రీ దుర్గాదేవీగా, 11న శుక్రవారం మహర్నవమి సందర్భంగా శ్రీ మహిషాసుర మర్దినిదేవీగా, 12న శనివారం విజయదశమి పురస్కరించుకుని అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవీగా భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. పది రోజుల పాటూ అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చనలను నిర్వహిస్తారన్నారు. భక్తులందరూ పూజల్లో పాల్గొని తరించాలని కోరారు. వివరాలకు వనంగుడి 08922-233972, చదురుగుడి 233744 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థినిల మృతి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన విద్యార్థినిలు మృతి చెందిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళవారం కొమరాడ మండలం కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కద్రక శారద, గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి.ఆమిటి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని నిమ్మల అవంతి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారని గుర్తు చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకాలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థినిల మృతికి కారణాలు తెలుసుకోవాలని, నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థినిల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిపై హత్యాయత్నం

బొబ్బిలి: పట్టణంలోని మెహెర్ కాలనీకి చెందిన వంగపండు సత్యానారాయణపై హత్యాయత్నానికి పాల్పడిన యామల గణేష్ నాయుడును హత్య చేయబోయాడన్న ఆరోపణపై అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్: ఆర్.రమేష్ తెలిపారు. సత్యనారాయణ, గణేష్‌కు పదేళ్ల కిందట ఇంటి తనఖా నిమిత్తం రూ.4.50లక్షలు ఇచ్చాడు. ఇటీవల గణేష్ ఆ ఇంటిని మరొకరికి విక్రయించాడు. కానీ, సత్యనారాయణకు తనఖా డబ్బులివ్వలేదు. దీనిపై కోర్టును ఆశ్రయించగా కోర్టు ఇటీవల చాటింపు వేయించింది. ఈ ఘటనపై కోపోద్రిక్తుడైన గణేష్ బుధవారం ఉదయం 8.30 గంటలకు కత్తితో వచ్చి సత్యనారాయణ ఇంటికి వచ్చి గొడవ పడుతూ మీరు చేసిన పనికి మిమ్మల్ని చంపుతానంటూ సత్యనారాయణను గాయపర్చాడు. సత్యనారాయణ భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గణేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కురుపాంలో జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 4న కురుపాంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుకొని 18 - 25 సంవత్సరములు ఉన్న నిరుద్యోగ యువతి, యువకుల కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పలు కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు వివరాలను హెచ్‌టీటీపీఎస్://స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒరిజినల్ జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశంలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 6303493720, 8978878557 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాలు విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం నిరసన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బెహరా శంకర్‌రావు, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కె.అప్పలసూరి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాలతో, 67 మంది ఎంపీల రాజీనామాలతో, 30 గ్రామాల రైతుల 32వేల ఎకరాల భూముల త్యాగంతో సాధించుకున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో తయారయ్యే నాణ్యమైన ఉక్కును ప్రైవేటు ఉక్కు సంస్థలు ప్రజలకు ఎందుకు అందించలేకపోతున్నాయో సమాధానం చెప్పాలన్నారు. సొంత ఘనులు లేకపోయినా ముడిసరుకు అవసరం మేరకు అందించిన సంవత్సరంలో 120 శాతం సామర్థ్యంతో పని చేయటం కనిపించలేదా.. అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక తిరుపతి వేంకటేశ్వరస్వామిని అడ్డం పెట్టుకుని ప్రజల నెత్తిపై భస్మాసుర హస్తం పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఊరుకోరని, ఉద్యమాలతో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ రమణ, జిల్లా కార్యదర్శులు బి.సూర్యనారాయణ, ఎ.గౌరినాయుడు, నగర కార్యదర్శి బి.రమణ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు అప్పలరాజు, కె.గౌతమి, జి.సత్యారావు, కె.రాకేష్, సీఐటీయూ నాయకులు హరిబాబు, రాములు, శ్రీను, సూరిబాబు, సాయి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామతీర్థంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గురువారం నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించి దేవస్థాన సిబ్బంది ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం స్వామి సన్నిధిలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు నిర్వహించి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం జరిపిస్తారు. 4న అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, యాగశాలలో విశేష హోమాలు జరిపించనున్నారు. ప్రత్యేక పూజలనంతరం ఈ నెల 9న శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరగనుంది. 12 పూర్ణాహుతి, అవబృదం చక్రస్నానం, జమ్మివేట కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించి ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. 13న శ్రీ వేంకటేశ్వరస్వామికి పుష్ప యాగం జరిపించి బ్రహ్మోత్సవాలను పూర్తి చేయనున్నారు. భక్తులు ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని ఈఓ వై.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

విజయనగరం ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

విజయనగరం అర్బన్: ఉత్సవ నిర్వహణ కమిటీతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన చాంబర్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి పండగకు లక్షలాదిమంది వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆ మూడు రోజులపాటు లేబర్ హాలీడే ప్రకటించాలన్న విషయంపై చర్చించారు. హోటళ్లు, సంస్థలు, షాపుల్లో పనిచేసే కార్మికులు, ఇతర ఉద్యోగులను ఉత్సవాల్లో భాగస్వాములను చేసే ఉద్దేశంతో ఆ మూడు రోజులపాటు సెలవు ఇవ్వాలని యోచిస్తున్నట్టు వెల్లడించారు. ఆహార పదార్థాలకు ఇబ్బంది పడకుండా భారీ ఎత్తున ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎస్.డి.అనిత, సీపీఓ పి.బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డీపీఓ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్..



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శిస్తున్న ఫ్లాష్‌మాబ్

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులు 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా నగరంలో బుధవారం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. అంబేడ్కర్ జంక్షన్, కోటా జంక్షన్ వద్ద నాటకం, డ్యాన్స్‌ల ద్వారా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ బొంతు కోటయ్య, స్వచ్ఛతా హి సేవా-2024 కో ఆర్డినేటర్ డాక్టర్ డి. నారాయణ, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

రక్తదాన 'సాధన'కు జాతీయస్థాయి గుర్తింపు

నెల్లిమర్ల: రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆపద సమయాన రక్తదానం చేసి ఆదుకుంటున్న జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. సంఘ అధ్యక్షుడు, 63 సార్లు రక్తదానం చేసిన పోలుబోతు దుర్గాప్రసాద్‌కు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో నిర్వహించిన జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్యశాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ అతుల్ గోయల్ బుధవారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 14 సంవత్సరాలుగా రక్తదాన కార్యక్రమాలకు సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు. జాతీయ సదస్సులో పోలుబోతు దుర్గప్రసాద్ మాట్లాడుతూ సాధన యువజన సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం చేస్తున్నామన్నారు. ఆ కృషి గ్రామస్థాయి నుంచి నేడు జాతీయ స్థాయిలో పేరుతెచ్చి పెట్టిందన్నారు. గుర్తింపు రావడంపై సంఘ సభ్యులు పసుమర్తి వెంకటరమణ, బెల్లాన వెంకటరావు, తుమ్ము అశోక్, మద్దిల కళ్యాణ్ సత్యవతి, అవునాపు అప్పలరాజు, మద్దిల రాంబాబు, పోలుబోతు భాస్కర్, ఉపాధ్యాయులు పి.రామారావు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, గ్రామ యువత ఆనందం వ్యక్తం చేశారు.